క్లుప్తంగా

17న ఇంటర్‌క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ క్రీడామైదానంలో ఈనెల 17వ తేదీన 2వ ఇంటర్‌క్లబ్ తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. సబ్‌జూనియర్స్, కేడెట్స్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకుని చాంపియన్‌షిప్‌కు హాజరు కావాలని సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కడప అగ్రికల్చర్: కడప మండల పరిధిలో అర్హత ఉండి రైతు భరోసా రాని రైతులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్తగా పాసు పుస్తకం వచ్చిన రైతులెవరైనా ఉంటే వారు ఆధార్‌కార్డు, పాసు పుస్తకంతో వ్యవసాయశాఖ సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కడప కల్చరల్ : ఇటీవల లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభ చూపిన నాగరాజుపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహకాలను అందజేశారు. క్లబ్ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితా సుధారాణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సువర్ణ పర్యవేక్షణలో ఈ ప్రోత్సాహకాలను అందజేశారు. ఇంటాక్ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు దుస్తులు, గడియారాలు, వారి బృందంగల ఫోటోలను అందజేశారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

వైవీయూ : ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఆత్మహత్య పరిష్కారం కాదని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సలీంబాషా సూచించారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఉమన్ ఎంపవర్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా మానసిక ఆరోగ్యకేంద్రం సహకారంతో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలని, చిన్నవిషయాలకే కుంగిపోకుండా, ప్రతికూల ఆలోచనలను విడనాడాలన్నారు. ఎవరైనా మానసికంగా ఇబ్బందుల్లో ఉంటే కౌన్సిలింగ్ ద్వారా వారిని మామూలు మనుషులను చేయవచ్చని సూచించారు. అనంతరం జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం క్లీనికల్ సైక్రియాటిస్ట్ ఎస్. రాధిక, నరసయ్య, శిల్ప, సుమన్, వీరావతి తదితరులు మానసిక సమస్యలు, వాటిని అధిగమించాల్సిన విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానసిక సమస్యలు ఉన్నవారు 14416 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం టోల్‌ఫ్రీ నెంబర్ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డా. జి. విజయలక్ష్మి, ఎన్‌సీసీ అధికారి విన్నీతేజ, ఉమన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటర్ నాగరత్న, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దస్తూరిలో ఉచిత శిక్షణ

కడప కల్చరల్ : విద్యార్థులు దస్తూరిని అందంగా రాసేందుకు తగిన శిక్షణ ఇస్తామని ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి, ఎడ్యుకేషనల్ ట్రైనర్ జి.మౌనిక తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులకు ఈ విషయం తెలిపారు. యువత, విద్యార్థులు చక్కని దస్తూరి లేకపోవడంతో కోల్పోతున్న అవకాశాలు, మార్కులు తగ్గడం తదితర అంశాలు వారిని మనోవేదనకు గురి చేస్తున్నాయని, అలాంటి వారి కోసం ప్రత్యేకంగా తాము ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వివరాలకు 95028 90722 నెంబరులో సంప్రదించాలన్నారు.

అకౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

వైవీయూ : వైవీయూలో పనిచేసే ఉద్యోగులు తమ ఉద్యోగ బాధ్యతలకు తగ్గట్లు నైపుణ్యాలు అందిపుచ్చుకున్నప్పుడే వృత్తికి న్యాయం చేయగలరని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్‌లకు గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్‌టీ)తో కలిపి ట్యాలీలో వృత్తిపరమైన శిక్షణను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన శిక్షణలో నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. 16 రోజుల శిక్షణ కాలంలో అకౌంట్స్ ఎలా నమోదు చేయాలి, బ్యాలెన్స్‌షీట్ ఎలా రాయాలి, సాఫ్ట్‌వేర్ టూల్స్‌ని ఎలా వినియోగించాలి, జీఎస్‌టీ ఎలా క్యాలిక్యులేట్ చేయాలి అనే అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. ఫైనాన్స్ అకౌంట్స్ విభాగాలు కీలకమన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

తొండూరు : పులివెందుల ప్రాంత వాటర్‌షెడ్ రైతుల ప్రయోజనార్థం కృషివిజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప జిల్లా నీటియాజమాన్య సంస్థ సంయుక్తంగా 7 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండవ రోజు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు.

ప్రతి డివిజన్‌లో రూ.20 లక్షలతో అభివృద్ధి

- మేయర్ కె. సురేష్ బాబు
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మాణం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రతి డివిజన్‌లో రూ.20 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నట్లు మేయర్ సురేష్ బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వినాయక నగర్ పరిధిలోని పాత వంతెన వద్దనుంచి జీటీఎస్ స్టేషన్ వరకూ రూ.13.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించాలని తీర్మాణించారు. 16, 17, 18వ డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం 25 మంది లోడర్లను రోజుకు రూ.400 కూలీతో నియమించుకోవడానికి అనుమతించారు. కడప కార్పొరేషన్‌లో పనిచేస్తూ సహజ మరణం పొందిన 12 మంది కార్మికులకు రూ. 2 లక్షల చొప్పున, ప్రమాదవశాత్తు మరణించిన ఒక కార్మికుడికి రూ.5 లక్షలు నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. మలేరియా విభాగంలో ప్రధాన మురికి కాలువల్లో పూడిక తీయుటకు రూ.500 రోజువారీ కూలీతో 30 మంది కార్మికులకు దక్షిణ పట్టణ మహిళా సమాఖ్య ద్వారా చెల్లించేందుకు తీర్మాణించారు. ఎర్రముక్కపల్లె ప్రాంతంలో ఉన్న నిఖిల్ రూరల్ డెవెలప్‌మెంట్ సొసైటీ పేరు మీద నడుస్తున్న నిరాశ్రయుల కేంద్రం కాలపరిమితిని పొడిగించేందుకు కార్పొరేటర్లు, అధికారులతో కమిటీ వేసి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కడప కార్పొరేషన్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దుటలో భాగంగా ఫిష్, మీట్ మార్కెట్, స్లాటర్ హౌస్, హజ్ హౌస్ నిర్మాణాల కోసం డీపీఆర్ తయారు చేయడానికి కన్సల్టెన్సీని నియమించుకోవడానికి అనుమతి మంజూరు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం.సుబ్బారెడ్డి, శిరీష, హేమలత, ఎస్ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఈఈలు నారాయణ స్వామి, కరిముల్లాఖాన్, డీఈలు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

ఎన్నికలను ఎదుర్కోవడానికి సన్నద్ధం కావాలి

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ కె. సురేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్లు, క్లస్టర్ ప్రెసిడెంట్లు, కార్పొరేటర్లు, ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌కు ఏజెంట్లను నియమించాలని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించి, ఎవరివైనా ఓట్లు లేకపోతే నమోదు చేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, పార్టీ నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్లస్టర్ పార్టీ ప్రెసిడెంట్ల నియామకం

వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ప్రెసిడెంట్లను నియమించినట్లు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తెలిపారు. సౌత్ జోన్ క్లస్టర్ ప్రెసిడెంట్‌గా పొట్టిపాటి జయచంద్రారెడ్డి, వెస్ట్‌జోన్‌కు మాసీమ బాబు, నార్త్ జోన్‌కు సుభాన్‌బాషా, ఈస్ట్ జోన్‌కు యానాదయ్య, తోటక్రిష్ణ నియమించారు.



జేసీఎస్ కన్వీనర్లు, కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

సంక్షేమంతోపాటు అభివృద్ధి పనులకు పెద్దపీట

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా పెద్దపీట వేశామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక 48 వ డివిజన్‌లోని రామచంద్రాపురంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. మానసిక వికలాంగురాలైన చిన్నారికి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆర్‌బీకే సెంటర్లు, సచివాలయాలను సర్వాంగ సుందరంగా నిర్మించామని తెలిపారు. సి. లక్ష్మిదేవి అనే మహిళ మాట్లాడుతూ వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న అమ్మ ఒడి పథకాల ద్వారా రూ.2.42 లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది.

సి. రామక్రిష్ణ అనే వ్యక్తి మాట్లాడుతూ తమకు వైఎస్సార్ రైతు భరోసా, పింఛన్ కానుక, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదుల ద్వారా రూ. 10, 26,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారు.

– ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, పస్తం అంజి, తోట క్రిష్ణ, మధు, మియ్యా, మనోజ్, టీపీ వెంకట సుబ్బమ్మ , బండి మరియలు, సుశీలమ్మ, రామలక్షుమ్మ, నారాయణమ్మ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.


మానసిక దివ్యాంగ చిన్నారికి పింఛన్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం

ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నియోజకవర్గంలో రానున్న ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, పోలింగ్ బూత్‌లకు సంబంధించి మార్పులు, చేర్పులు చేస్తున్నామని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కడప నగర పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తర్వాత కొన్ని కేంద్రాల మార్పుకు చర్యలు చేపట్టామన్నారు. కడపలో రామకృష్ణ హైస్కూలు, వికాస్ డిగ్రీ కళాశాల, రామకృష్ణ ఎయిడెడ్ స్కూలు స్థానాల్లో చైతన్య స్కూలు, పాత మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాల, ఆకులవీధిలోని మున్సిపల్ అప్పర్‌ప్రైమరీ పాఠశాలను కేంద్రాలుగా నిర్ణయించామన్నారు. అలాగే పుట్లంపల్లెలోని రెండు బూత్‌లలో, సరోజిని నగర్‌లోని మండల పరిషత్ స్కూలులో, అలాగే వార్డు ఆఫీసులో ఉన్న కేంద్రాన్ని శివానందపురంలోని మండల పరిషత్ హైస్కూలులోగానీ, సమీపంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బూత్‌లను మార్చేందు కు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయా బూత్‌లను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కడప తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

ఆర్ట్స్ కళాశాలలో ఉత్సాహంగా రీల్ మేకింగ్ పోటీలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై డ్రామా, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్, రెడ్ రిబ్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్ విచ్చేసి పోటీలను నిర్వహించారు.


ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన, చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన ఈ కాంపిటీషన్‌లో ప్రథమ బహు మతి కడప ఆర్ట్స్ కళాశాలకు రాగా, రెండవ బహుమతి శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, మూడవ బహుమతి ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పొందాయి. అలాగే రీల్ మేకింగ్‌లో ప్రథమ బహుమతి డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూకు, రెండవ బహుమతి శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, తృతీయ బహుమతి కడప ఆర్ట్స్ కళాశాల పొందాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం సూపర్‌వైజర్లు ప్రసాద్, సాదిక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు

బద్వేలు అర్బన్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని జరగనున్న ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయాశాఖల అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, మున్సిపల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎక్సైజ్ అధికారులతో బుధవారం మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్‌తో కలిసి నిర్వహించిన ఉత్సవాల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, సంబంధిత అధికారుల అనుమతులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహాలను ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రతిష్టించేలా చూడాలని పోలీసులకు సూచించారు. అలాగే నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా మండపాల సమీపంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్, మండల పరిషత్ అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమీషనర్, ఎక్సైజ్ అధికారులు, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

కడప ఎడ్యుకేషన్: కడప నగరం కసాయివీధిలో ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా డ్రైనేజీ కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌కు మూత లేదు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆపన్నహస్తం వన్ స్టాప్ సెంటర్

– సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి సెక్రటరీ కవిత తెలిపారు. బుధవారం కడప రిమ్స్ ఆవరణలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను(సఖి) ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే చోట అనేక సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వన్‌స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం ,మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం , తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు , యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు వంటి సందర్భాలలో మహిళలు ఈ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగి ఉండాలని, ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, ఎస్ఐ జ్యోతి, న్యాయవాది ఉమాదేవి, కౌన్సిలర్ సునీత, సిబ్బంది శారద, మాధవీలత పాల్గొన్నారు.


వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

కేంద్ర కారాగారంలో భద్రత ఉండదని చెప్పడం హాస్యాస్పదం

కడప అగ్రికల్చర్: స్కిల్ డెవలప్‌మెంట్‌స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటూ రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రకారాగారంలో భద్రత ఉండదని చెప్పడం చూస్తే హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర కారాగారంలో సైతం భద్రత ఉండదని దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక వాదనను చంద్రబాబు ముందుకు తెస్తున్నారన్నారు. రోజుకు కోటిన్నర రూపాయలు వకీలు ఫీజు చెల్లిస్తూ లిటిగేషన్ నడుపుతున్నది చంద్రబాబు కాదా అన్నారు.

యూనియన్ల గుర్తింపుపై హర్షం


స్వీట్లు పంచుకుంటున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆర్టీసీ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయూ నాయకులు డిపో, గ్యారేజీ, ఆర్టీసీ బస్టాండు వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయా యూనియన్లకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంతో స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీకి జీఓ నెంబరు 96 ప్రకారం గుర్తింపు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కేకే కుమార్, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ నాగసుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ రామ్మూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ఎన్ఎంయూ రీజినల్ అధ్యక్షులు నాగముణి, జాయింట్ సెక్రటరీ కేఎస్ దాస్, డిపో అధ్యక్షులు జయరాం, చైర్మన్ రామలక్షుమయ్య, డిపో సెక్రటరీ సగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో ఉన్నత సమాజం

కడప కల్చరల్ : విద్యార్థి దశ నుంచి నైతిక విలువలతో పెరిగిన వారితో అలజడులు లేని సమాజం ఏర్పడగలదని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్వీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై ప్రత్యేక తరగతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులు సరైన మార్గంలో పయనించేందుకు క్రమశిక్షణ ఎంతో ఉపకరిస్తుందన్నారు. మానవత సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి మాట్లాడుతూ క్రమశిక్షణ వల్ల వ్యక్తుల్లో నైతిక విలువలు పెరుగుతాయన్నారు. సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మన ఇతిహాసాలు మనకు విలువలకు సంబంధించి ఎన్నో విషయాలను నేర్పాయన్నారు. కార్యనిర్వాహక సభ్యుడు సమ్మెట సత్యనారాయణ మాట్లాడుతూ విలువలను ఆచరించినపుడే జీవితం ధన్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

వల్లూరు : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని, క్రీడల వలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం లభిస్తుందని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, త్రో బాల్, వాలీ బాల్, టెన్నికాయిట్ ఆటల పోటీలను నిర్వహించారు. మండలంలోని గంగాయపల్లె జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, వల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, కస్తూర్బా బాలికా విద్యాలయం విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి తెలిపారు.

నేడు అథ్లెటిక్స్ పోటీలు

ఈ పోటీల్లో భాగంగా గురువారం వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాల బాలికలకు అథ్లెటిక్స్, యోగా పోటీలను నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడినా, అక్రమ రవాణాకు సహకరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో బద్వేలు రూరల్ సర్కిల్, పోరుమామిళ్ల సర్కిల్, అర్బన్ స్టేషన్ పరిధిలో గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ఉన్న పాత నేరస్తులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో ఉన్న నేరస్తులపై గట్టి నిఘా ఉంటుందని, ఎవరైనా మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే కేసుల్లో ఉండి కోర్టుకు హాజరుకాకుండా తిరుగుతున్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సీఐలకు సూచించారు. కార్యక్రమంలో సీఐలు సుదర్శన్‌ప్రసాద్, యుగంధర్, చిరంజీవి, ఎస్ఐలు వెంకటరమణ, చంద్రశేఖర్, హరిప్రసాద్, నాగమురళి, మల్లికార్జునరెడ్డి, కె.సి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేదమంత్రోచ్చారణలతో కమనీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పాయసంపల్లె, అలిదెన, ఇందుకూరు గ్రామాల్లో సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులకు అనుకూలమైన వాతావరణంతోపాటు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీనివలన మొక్క గిడసబారి దిగుబడిపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. పత్తిపంట సాగు చేసిన రైతులు ఒక లీటరు నీటికి 2మి.లీ పిప్రోనిల్, మరియు 10 గ్రాములు 19,19,19 కలిపి పంటపై పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.